క్లుప్తంగా

కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతుబజార్లలో కూరగాయల ధరలు (కిలో...రూపాయల్లో...) టమోటా 13, వంకాయ 23, బెండ 55, పచ్చిమిర్చి 50, కాకర 38, బీర 45, క్యాలీఫ్లవర్ 28, క్యాబేజీ 09, కారెట్ 15, దొండ 45, ఆలు 18, ఉల్లి 16, గోకర 55, దోస 37, సొర 11, పొట్ల 15, అరటి 10, చిక్కుడు 55, అర్వి 55, మునగ 28, చిలగడదుంప 37, బీట్‌రూట్ 19, కీర 19, ఫ్రెంచ్ బీన్స్ 65, కాప్సికమ్ 45. ఈ ధరలు బుధవారం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

నేడు జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలు

మన్సూరాబాద్: డాక్టర్ బాబూజగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలను ఎల్‌బీనగర్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహాల వద్ద బుధవారం నిర్వహిస్తున్నట్లు ఉత్సవాల కమిటీ ఎల్‌బీనగర్ సమన్వయకర్త ఆడాల రమేష్, కొంగరి నర్సింహారావు తెలిపారు. ఈ ఉత్సవాలకు ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, బీజేపీ రంగారెడ్డి అర్బన్‌జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి, బీఆర్‌ఎస్ ఎల్‌బీనగర్ ఇన్‌చార్జి ముద్దగోని రామ్మోహన్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ ఎల్‌బీనగర్ ఇన్‌చార్జి జక్కిడి ప్రభాకర్‌రెడ్డి, కార్పొరేటర్లు తదితరులు హాజరవుతున్నట్టు తెలిపారు.

ఫుడ్ ఫెస్టివల్ అదుర్స్



ఫుడ్ ఫెస్టివల్‌ను ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్ దిలీప్‌రెడ్డి

మలక్‌పేట: దిల్‌సుఖ్‌నగర్‌లోని శ్రీసాయి డిగ్రీ అండ్ పీజీ కాలేజ్‌లో మంగళవారం ఫుడ్ ఫెస్టివల్‌ను ఘనంగా నిర్వహించారు. భిన్న రకాల వెజ్–నాన్‌వెజ్ వంటకాలతో నోరూరించే రుచులకు కాలేజ్ వేదికైంది. ప్రిన్సిపాల్ దిలీప్‌రెడ్డి ఫుడ్ ఫెస్టివల్‌ను ప్రారంభించి, లెక్చరర్లతో కలిసి విద్యార్థులు వండిన వంటకాలను రుచి చూశారు. అన్ని కళల్లో విద్యార్థులు ప్రావీణ్యం కలిగి ఉండాలని, సంప్రదాయ వంటలపై అవగాహన పెంచుకోవడానికి ఫుడ్‌ఫెస్టివల్స్ ఉపయోగపడతాయని ఆయన అన్నారు. విద్యార్థులు పులిహోరా, గారెలు, దద్దోజనం, పూర్ణాలు, భక్ష్యాలు, క్యారెట్ హల్వా, షీర్ కుర్మా, ఎగ్ బిర్యానీ, మిల్క్‌షేక్‌తో పాటు ఎన్నో రకాలు వంటకాలు తయారు చేసి శెభాష్ అనిపించుకున్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాచార్యులు, లెక్చరర్లు వెంకటేశ్వర్లు, శేఖర్‌రెడ్డి, ప్రసాద్, సీత, శోభ, షర్మిల, అన్నపూర్ణ, అపర్ణ, జ్యోతి, లావణ్య, వినీల, మమత పాల్గొన్నారు.

చెక్‌బౌన్స్ కేసులో 3 నెలల జైలు

రంగారెడ్డి కోర్టులు: చెక్‌బౌన్స్ కేసులో మూడు నెలల జైలు శిక్ష తోపాటు రూ.2.50 లక్షల పరిహారం చెల్లించాలని 2వ అదనపు మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ ఉషశ్రీ తీర్పునిచ్చారు. కోయలేకర్ జ్ఞానేశ్వర్ వద్ద ఓ వ్యక్తి 2 లక్షల 50 వేల రూపాయలు అప్పుగా తీసుకొని తిరిగి చెల్లించలేదు. దీంతో జ్ఞానేశ్వర్ 2021 సంవత్సరంలో ఆ వ్యక్తి ఇచ్చిన చెక్కును బ్యాంకులో జమ చేయగా అది బౌన్స్ అయ్యింది. దీంతో చేసేది లేక కోర్టును ఆశ్రయించారు. కేసు పూర్వాపరాలను పరిశీలించిన కోర్టు మంగళవారం పైవిధంగా తీర్పు వెలువరించింది.

రోడ్డు పనులకు మంత్రి శంకుస్థాపన

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని నాదర్‌గుల్‌లో హెచ్‌ఎండీఏ నిధులతో నిర్మించనున్న రోడ్లకు మంత్రి సబితారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై అధికారులతో కలిసి శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఏళ్ల నుంచి పెండింగ్‌లో ఉన్న రోడ్ల అభివృద్ధి పనులను హెచ్‌ఎండీఏ నిధులతో చేస్తున్నామన్నారు. నియోజకవర్గాన్ని ఉన్నతంగా తీర్చిదిద్దే లక్ష్యంతో పని చేస్తున్నామని వివరించారు. ఈ పనులకు సహకరిస్తున్న ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్, కమిషనర్ కృష్ణమోహన్‌రెడ్డి, డీఈఈ అశోక్‌రెడ్డి, బీజేపీ కార్పొరేటర్ల నిమ్మల సునీత, ఇంద్రసేన, తోట శ్రీధర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు, మాజీ కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ప్రొటోకాల్ జగడం

ప్రొటోకాల్ పాటించకుండా కొబ్బరికాయలు ఎలా కొడతారని మేయర్ పారిజాత మంత్రిని తప్పుపట్టారు. అధికారులు అధికార పార్టీ కనుసన్నల్లోనే ఉంటూ ప్రతిపక్ష ప్రజాప్రతినిధులను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆరోపించారు. హెచ్‌ఎండీఏ నిధులను మంత్రి తీసుకువచ్చారని.. మేయర్ కోసం ఆగాల్సిన పనిలేదని బీఆర్‌ఎస్ కార్పొరేటర్లు, నాయకులు వాదిస్తున్నారు. ఇందుకు స్పందించిన మేయర్ కార్పొరేషన్ సాధారణ నిధులతో చేపట్టే అభివృద్ధి పనుల్లో మేం కూడా ప్రొటోకాల్ పాటించమని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ సీనియర్ నాయకుడు నిమ్మల రవికాంత్‌గౌడ్ మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్, కాంగ్రెస్ నేతలు కలిసి రాజకీయం చేస్తూ.. ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆరోపించారు.

‘శోభాయాత్ర’ను జయప్రదం చేయండి

ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి



హనుమాన్ జయంతి పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

ఎల్‌బీనగర్: హనుమాన్ జయంతి సందర్భంగా ఈనెల 6న నిర్వహించే శోభాయాత్రను విజయవంతం చేయాలని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. హనుమాన్ జయంతి సందర్భంగా మంగళవారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో బీఆర్‌ఎస్ పార్టీ ముఖ్యకార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శోభయాత్ర పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, నగరం మొత్తం ఎల్‌బీనగర్ వైపు చూసే విధంగా శోభాయాత్రను నిర్వహిస్తామని, ఎల్‌బీనగర్ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. శోభాయాత్ర గురువారం మధ్యాహ్నం 3 గంటలకు సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియం నుంచి ప్రారంభమవుతుందని తెలిపారు. సరూర్‌నగర్ స్టేడియం నుంచి వనస్థలిపురం చౌరస్తా, ఎన్‌జీఓఎస్ కాలనీ, బీఎన్‌రెడ్డినగర్ చౌరస్తా, హస్తినాపురం, సాగర్ రింగ్ రోడ్డు, బైరామల్‌గూడ, కర్మన్‌ఘాట్, చంపాపేట మీదుగా కర్మన్‌ఘాట్ ఆంజనేయ స్వామి ఆలయానికి చేరుకుంటుందన్నారు. మహిళలకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటున్నామని, ప్రతిచోట మంచినీటి బాటిళ్లు, మజ్జిగ ఏర్పాటు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ సుజాతానాయక్, మాజీ కార్పొరేటర్లు ముద్రబోయిన శ్రీనివాస్‌రావు, కొప్పుల విఠల్‌రెడ్డి, వజీర్ ప్రకాశ్‌గౌడ్, భవాని ప్రవీణ్, సామ తిరుమల్‌రెడ్డి, జిట్టా రాజశేఖర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ పార్టీ డివిజన్ల అధ్యక్షుడు కటికరెడ్డి అరవింద్‌రెడ్డి, చింతల రవికుమార్, వరప్రసాద్‌రెడ్డి, జక్కిడి మల్లారెడ్డి, సత్యంచారి, శ్రీశైలం యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

యాత్రలో అధిక సంఖ్యలో పాల్గొనాలి

నాగోలు: హనుమాన్ యువసేన ఆధ్వర్యంలో గురువారం కొత్తపేట డివిజన్‌లో జరిగే హనుమాన్ జయంతి శోభాయాత్రలో అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని యువసేన అధ్యక్షుడు యాశ్పాల్‌గౌడ్ కోరారు. మంగళవారం మోహన్‌నగర్‌లో హనుమాన్ జయంతి ఊరేగింపు పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా యాశ్పాల్‌గౌడ్ మాట్లాడుతూ, ఈ నెల 6న మోహన్‌నగర్ నుంచి కొత్తపేట, మారుతీనగర్, జైన్ మందిర్, బాబూ కాంప్లెక్స్, ఇంద్రనగర్, చైతన్యపురి మీదుగా యాత్ర కొనసాగుతుందని తెలిపారు. పోస్టర్ ఆవిష్కరణలో హనుమాన్ యువసేవ నాయకులు శ్రీకాంత్‌గౌడ్, కిరణ్‌కుమార్, కులకర్ణి, తరుణ్‌సింగ్, గౌరవ్‌షా, సంప్రీత్, అవినాష్, భావన్, చింటూ, అవినాస్, వరుణ్ తదితరులు పాల్గొన్నారు.



మోహన్‌నగర్‌లో పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న యాశ్పాల్‌గౌడ్ తదితరులు

బాలల సదనాల్లో చైల్డ్ ఫ్రెండ్లీ లీగల్ సర్వీసెస్

జిల్లా జడ్జి గోవర్ధన్‌రెడ్డి

సైదాబాద్: జువైనల్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్, యూనిసెఫ్‌ల సమన్వయంతో ప్రభుత్వ బాలల సదనాల్లో చైల్డ్ ఫ్రెండ్లీ లీగల్ సర్వీసెస్ అందిస్తున్నామని జిల్లా జడ్జి, తెలంగాణ స్టేట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ మెంబర్ సెక్రటరీ గోవర్ధన్‌రెడ్డి తెలిపారు. మంగళవారం సైదాబాద్‌లోని ప్రభుత్వ బాలల పరిశీలక గృహాన్ని ఆయన తెలంగాణ స్టేట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ, యూనిసెఫ్ సభ్యులతో కలిసి సందర్శించారు. గృహంలో బాలలకు అందుతున్న వసతులను పరిశీలించారు. సదనం మైదానంలో ఏర్పాటు చేసిన ఆర్చరీ శిక్షణ కేంద్రాన్ని వారు సందర్శించారు. అనంతరం బాలలతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వ సదనాల్లోని బాలలు, వారి తల్లిదండ్రులకు అవసరమైన న్యాయ సహాయం అందిస్తామన్నారు. కార్యక్రమంలో జువైనల్ డిపార్ట్‌మెంట్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ మీర్జా రజాఅలీ బేగ్, యూనిసెఫ్ స్టేట్ డైరెక్టర్ సోనీజార్జ్, డేవిడ్, సూపరింటెండెంట్ సయ్యద్ అఫ్జల్‌షా అలీ పాల్గొన్నారు.



సైదాబాద్‌లోని అబ్జర్వేషన్ హోంలో మాట్లాడుతున్న జిల్లా జడ్జి గోవర్ధన్‌రెడ్డి

యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడి అరెస్టుపై నిరసన



సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ దిష్టిబొమ్మలను దహనం చేస్తున్న యూత్ కాంగ్రెస్ నాయకులు

మన్సూరాబాద్: పదో తరగతి పరీక్ష పత్రాల లీకేజీపై నిరసన తెలిపిన యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివసేనారెడ్డి, ఎన్‌ఎస్‌యూఐ నేతలను అక్రమంగా అరెస్టు చేసినందుకు యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి భీమిడి రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ఎల్‌బీనగర్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద మంగళవారం సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్‌ల దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ, విద్యార్థుల జీవితాలతో కేసీఆర్ ప్రభుత్వం చెలగాటమాడుతోందని ప్రశ్న పత్రాల లీకేజీలకు బాధ్యత వహిస్తూ విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, ఐటీశాఖ మంత్రి కేటీఆర్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ నాయకులు పణ్యాల జైపాల్‌రెడ్డి, అనుకిరణ్‌రెడ్డి, శ్రీపాల్‌రెడ్డి, రాజేష్, మధుసూదన్, ఆసీఫ్‌అలీ, పవన్, ప్రభోద్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

లింగోజిగూడ: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి, మహిళా శక్తే జాతీయ శక్తి అని ఎమ్మెల్సీ దయానంద్ గుప్తా, బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు పేరాల శేఖర్జీ అన్నారు. ఇంటర్నేషనల్ వాసవి మహిళా సమాఖ్య 8వ వార్షికోత్సవాన్ని మంగళవారం సమాఖ్య అధ్యక్షురాలు ఉప్పల రాజ్యలక్ష్మి ఆధ్వర్యంలో కర్మన్‌ఘాట్‌లోని శ్రీ లక్ష్మి గార్డెన్స్‌లో ఘనంగా నిర్వహించారు. మహిళలకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథులుగా పాల్గొన్న దయానంద్ గుప్తా, శేఖర్జీలు మాట్లాడుతూ, మహిళల అభివృద్ధి కోసం కృషి చేస్తున్న రాజ్యలక్ష్మికి అన్ని విధాల సహాయ సహకారాలు అందజేస్తామన్నారు. అనంతరం రాజ్యలక్ష్మి మాట్లాడుతూ, ఆర్యవైశ్య కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలని, ఆర్యవైశ్య బంధును కూడా అందజేయాలని డిమాండ్ చేశారు. త్వరలో ముఖ్యమంత్రి కేసీఆర్‌ను కలిసి వినతి పత్రం అందజేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు ఉపేందర్ గుప్తా, బాల్‌రాజ్, సమాఖ్య సభ్యులు కల్పన, సరిత, పద్మ, సరిత, బచ్చు వీన, సంతోషి, అనిత, చంద్రిక, కృష్ణవేణి, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.



బహుమతులు అందజేస్తున్న దయానంద్ గుప్తా

కృష్ణయుక్తకు బాలరత్న నంది అవార్డు

వనస్థలిపురం: విద్యా రత్న బింగి మల్లేశ్వరి మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం రాత్రి చిక్కడపల్లి త్యాగరాయ గానసభ లలిత కళావేదికపై నిర్వహించిన ఉగాది పురస్కారాలు–2023 కార్యక్రమంలో వనస్థలిపురానికి చెందిన డాక్టర్ గంధం శాంతకుమార్ కుమార్తె కృష్ణయుక్తను బాలరత్న నంది అవార్డుతో సత్కరించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన తెలంగాణ నీటిపారుదల అభివృద్ధి సంస్థ చైర్మన్ సముద్రాల వేణుగోపాలచారి, రాష్ట్ర టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తాలు కృష్ణయుక్తకు అవార్డు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, చిన్న వయస్సులోనే కూచిపూడి నృత్యంలో ప్రతిభ కనబరుస్తున్న కుమారి కృష్ణయుక్తకు ఉజ్వల భవిష్యత్ ఉందని అన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి బింగి నరేందర్‌గౌడ్, డాక్టర్ కృష్ణప్రియ తదితరులు పాల్గొన్నారు.



లలిత కళావేదికపై నృత్య ప్రదర్శన ఇస్తున్న కృష్ణయుక్త

అభివృద్ధి పనులు సకాలంలో పూర్తి చేయాలి

మలక్‌పేట: మూసారంబాగ్‌లోని గాయత్రి అపార్ట్‌మెంట్ వద్ద మంగళవారం కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి మధుసూదన్‌రెడ్డి సీసీ రోడ్డు పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, పెండింగ్‌లో అభివృద్ధి పనులపై దృష్టి సారించినట్లు తెలిపారు. ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. నాణ్యత ప్రమాణాల్లో తేడా వస్తే సహించేది లేదన్నారు. అనంతరం ఇంద్రనగర్ కమ్యూనిటీహాల్ దగ్గర కొనసాగుతున్న రోడ్డు పనులను పరిశీలించారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ వర్క్ ఇన్‌స్పెక్టర్ సత్తిరెడ్డి, నాయకులు చందు, కొప్పుల దినేష్, వంశీ, నవీన్, శంకర్, దినేష్ తదితరులు ఉన్నారు.

కంటి వెలుగు కేంద్రం ప్రారంభం

సలీంనగర్ బాలదానమ్మబస్తీ కమ్యూనిటీహాల్‌లో ఏర్పాటు చేసిన కంటివెలుగు కేంద్రాన్ని మంగళవారం కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి మధుసూదన్ రెడ్డి ప్రారంభించారు. సలీంనగర్, బాలదానమ్మ బస్తీవాసులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో శాలివాహననగర్ యూపీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ తరుణ్, బస్తీ దవాఖానా డాక్టర్ ప్రణీత్, విశ్వశాంతి, రేఖ, ఆశవర్కర్లు పాల్గొన్నారు.



సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ భాగ్యలక్ష్మి

మార్కెట్‌ను అన్ని విధాలా అభివృద్ధి చేస్తాం



ఎస్జీఎస్ దామోదర్‌ను సన్మానిస్తున్న చైర్‌పర్సన్ అనితానాయక్, వైస్‌చైర్మన్ భూమేష్

చాదర్‌ఘాట్: హైదరాబాద్ జిల్లా వ్యవసాయ మార్కెట్‌ను అన్నివిధాల అభివృద్ధి చేస్తామని చైర్‌పర్సన్ అనితానాయక్ అన్నారు. మంగళవారం మలక్‌పేటలోని మార్కెట్ కార్యాలయంలో కమిటీ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పాలకవర్గం సభ్యులు, అధికారులు పలు అంశాలపై చర్చించారు. మార్కెట కమిటీ అభివృద్ధి, మార్కెట్ ఫీజు తదితర అంశాలపై చర్చించామని వారు తెలిపారు. మార్కెట్‌లో రూ.కోటి 30 లక్షలతో పలు అభ్యవృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. 2022–23 ఆర్థిక సంవత్సరంలో రూ. 10 కోట్ల 57 లక్షలు మార్కెట్ ఫీజు సేకరించామన్నారు. అత్యధిక మార్కెట్ ఫీజు సేకరించడంతో చైర్‌పర్సన్ అనితానాయక్, వైస్ చైర్మన్ భూమేష్, ఎస్జీఎస్ దామోదర్, గ్రేడ్–3 కార్యదర్శి రవీందర్‌రెడ్డిలను డైరెక్టర్లు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో డైరెక్టర్ బట్కిరి విద్యానంద్, మైల రవికాంత్, రాము యాదవ్, నరేష్, లలిత, అభిషేకం, సల్మాన్‌ఖాన్, ఎజాస్, మాణిక్‌రావు, యాదగిరి పాల్గొన్నారు.

గ్రామ కంఠంలో అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోండి

నాగోలు: నాగోలు బండ్లగూడ పరిధిలోని ఫత్తులగూడ గ్రామంలోని గ్రామ కంఠం స్థలంలో అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని ఫత్తులగూడ గ్రామస్తులు మంగళవారం జీహెచ్ఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ, దేవాలయం ఇతర అవసరాల కోసం వదిలేసిన గ్రామ కంఠం స్థలంలో ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమ నిర్మాణాలు చేస్తున్నారని తెలిపారు. కబ్జాదారులపై చర్యలు తీసుకొని గ్రామ కఠం స్థలం కాపాడాలని కోరారు. కార్యక్రమంలో ఫత్తులగూడ గ్రామస్తులు కాటేపాక నర్సింహ, రమేష్, బద్దం కృష్ణగౌడ్, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

పన్ను చెల్లింపులో ఐదు శాతం రాయితీ

కమిషనర్ కృష్ణమోహన్‌రెడ్డి

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని పట్టణ ప్రజలు 2022–23 సంవత్సరానికిగాను ఆస్తి పన్నులు చెల్లించి నగరాభివృద్ధికి సహకరించారని మున్సిపల్ కమిషనర్ కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. 2023–24 సంవత్సరానికిగాను ఏప్రిల్ 30 వరకు పన్ను చెల్లించే వారికి ఐదు శాతం రాయితీ కల్పిస్తున్నామని చెప్పారు.

దృష్టిలోప నివారణకు ‘కంటి వెలుగు’

బడంగ్‌పేట్: దృష్టిలోపాన్ని నివారించేందుకే ప్రభు త్వం కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రవేశ పెట్టిందని మేయర్ చిగురింత పారిజాత అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని 30వ డివిజన్ అంబేడ్కర్ చౌరస్తాలో ఉన్న కమ్యూనిటీ హాల్‌లో కంటి వెలుగు శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరాన్ని మంగళవారం డిప్యూటీ మేయర్ ఇబ్రాంశేఖర్, కార్పొరేటర్ భీమిడి స్వప్నతో కలిసి ఆమె ప్రారంభించారు. అనంతరం మేయర్ మాట్లాడుతూ దృష్టిలోపానికి కారణాలు ఎన్నో ఉన్నాయని.. అందుకు 18 ఏళ్లు నిండిన ప్రతీ ఒక్కరు కంటి పరీక్షలు చేయించుకుని అవసరమైన వారు కంటి అద్దాలు పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బి.జంగారెడ్డి, డానియల్, బంగారి బాబు, వైద్యులు, ఆశ వర్కర్లు, సిబ్బంది ఉన్నారు.

దాడికి దారితీసిన సెటిల్‌మెంట్

మజ్లిస్ నాయకుడిపై కేసు

పహాడీషరీఫ్: సెటిల్‌మెంట్ విషయంలో నెలకొన్న వివాదంలో మజ్లిస్ నాయకుడు ఓ వ్యక్తిపై దాడి చేసిన సంఘటన బాలాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. బాధితుడు తెలిపిన ప్రకారం.. షాహీన్‌నగర్ హైవే హోటల్ వద్ద వారం రోజుల క్రితం ట్రాలీ ఆటో ఢీ కొని ఓ గృహిణి మృతి చెందిన విషయం విదితమే. కాగా మృతురాలి కుటుంబానికి వాహనదారుడి నుంచి ఏదైనా సాయం అందించాలనే విషయమై పరిచయస్తుడు షేక్ అమీర్ (41) ఒక వైపు.. మరోవైపు మజ్లిస్ నాయకుడు సయ్యద్ యాహ్యాలు మధ్యవర్తిత్వం వహించారు. తనపై అసత్య ప్రచారం చేశారనే కోపంతో సోమవారం సాయంత్రం అమీర్‌పై యాహ్యా దాడి చేశాడు. ఈ విషయమై అమీర్ బాలాపూర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తులో ఉంది.

ఘనంగా ఆంజనేయ రథసేవ

చంచల్‌గూడ: సీతారామకల్యాణ మహోత్సవంలో భాగంగా మంగళవారం ఉప్పరిగూడ రామాలయంలో ఆంజనేయ రథసేవను ఘనంగా నిర్వహించారు. సీతారామ సమేత ఆంజనేయ ఉత్సవ విగ్రహాలను కుర్మగూడ, రెయిన్‌బజార్ డివిజన్ల పరిధిలో ఊరేగించారు. శ్రీ రామభక్త సమాజం ఆధ్వర్యంలో భజన కార్యక్రమం కొనసాగింది. మాజీ కార్పొరేటర్ సహదేవ్‌యాదవ్, గణేష్ ఉత్సవ సమితి నాయకులు మహేందర్, కామాటి మహేష్, కమిటీ సభ్యులు నిరంజన్‌యాదవ్, క్రాంతియాదవ్, ప్రవీణ్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.



ఊరేగింపులో పాల్గొన్న మాజీ కార్పొరేటర్ సహదేవ్‌యాదవ్ తదితరులు

ఇక ప్రతి మంగళవారం అన్నదానం



అన్నదానం చేస్తున్న సొసైటీ సభ్యులు

ఎల్‌బీనగర్: ముద్దగోని బాబయ్యగౌడ్ జ్ఞాపకార్థం త్రినేత్ర సొసైటీ ఆధ్వర్యంలో మంగళవారం బీఎన్ రెడ్డి నగర్ చౌరస్తాలో అన్నదానం చేశారు. ఈ సందర్భంగా సొసైటీ అధ్యక్షుడు సుమన్‌గౌడ్ మాట్లాడుతూ, బాబయ్యగౌడ్ జ్ఞాపకార్థం ఈ రోజు నుంచి ప్రతి మంగళవారం బీఎన్‌రెడ్డినగర్ చౌరస్తాలో అన్నదానం చేస్తామని ప్రకటించారు. కార్యక్రమంలో గోపాల్‌దాస్, రాము, జగన్మోహన్, గౌతమ్ పటేల్, పవన్, జానీబాయ్, ప్రకాష్, సల్మాన్, జితేందర్ తదితరులు పాల్గొన్నారు.

జనాభాకు అనుగుణంగా మౌలిక వసతులు

కార్పొరేటర్ సుజాతానాయక్

హస్తినాపురం: డివిజన్ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో రోజురోజుకూ పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ప్రజలకు మౌలిక వసతులు కల్పించేందుకు తన శాయశక్తులా కృషి చేస్తానని హస్తినాపురం డివిజన్ కార్పొరేటర్ బానోతు సుజాతానాయక్ అన్నారు. హస్తినాపురం డివిజన్ పరిధిలోని హనుమాన్‌నగర్ కాలనీలో బీటీ రోడ్లకు, సీసీ రోడ్లు వేసేందుకు కోటి 77 లక్షల రూపాయల నిధులు మంజూరు చేసినందుకు కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు కార్పొరేటర్ సుజాతానాయక్ దంపతులకు శాలువాకప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి సహకారంతో డివిజన్ పరిధిలో నెలకొన్న సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో నాయకులు రామచంద్రనాయక్, గోపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, చంద్రమౌళిచారి, సోషల్‌మీడియా ఇన్‌చార్జ్ గంధం శ్రీనివాస్, విద్యార్థి నాయకుడు రోహిత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కార్పొరేటర్ దంపతులను సన్మానిస్తున్న హనుమాన్‌నగర్ వాసులు

ప్రతిభ చాటి పురస్కారాలు అందుకున్నారు

చిత్రలేఖనం, సాంకేతికతలో రాణిస్తున్న అక్కాచెల్లెళ్లు

సైదాబాద్: చిన్నారులకు ఆసక్తి గల రంగంలో శిక్షణ ఇచ్చి ప్రోత్సహిస్తే వారు ఆయా రంగాల్లో ఉన్నత శిఖరాలు అధిరోహిస్తారనడానికి నిదర్శనంగా నిలుస్తున్నారు ఈ అక్కాచెల్లెళ్లు. ఐఎస్‌సదన్ డివిజన్ వినయ్ నగర్ కాలనీకి చెందిన దివంగత రంగా నవీన్‌కుమార్, ప్రసన్నకుమారి దంపతుల కుమార్తెలు సంజన, సాన్విక ఎల్‌బీనగర్ అక్షర ఇంటర్నేషనల్ స్కూల్‌లో చదువుతున్నారు. 7వ తరగతి పూర్తి చేసిన సంజన బహుళ పద్ధతుల్లో చిత్రలేఖనం వేయడంలో దిట్ట. 2వ తరగతి పూర్తి చేసిన సాన్విక పలురకాల సాంకేతిక పరికరాల తయారీలో నేర్పరి. వీరి ప్రతిభను తెలుగు వెలుగు సాహితీ వేదిక అనే సంస్థ గుర్తించింది. ఇటీవల నగరంలో సంస్థ ఆధర్వంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయా రంగాల్లో విశేష ప్రతిభ చూపినందుకు ఈ అక్కాచెల్లెళ్లకు తెలుగు వెలుగు ఉగాది మహానంది జాతీయ పురస్కారం –2023తో సత్కరించింది. ఈ సందర్భంగా మంగళవారం వారు ఐఎస్ సదన్‌లో మాట్లాడుతూ, తమ తల్లి ప్రసన్నకుమారి, ఉపాధ్యాయురాలు మాధవరం సూర్యఅర్చనల ప్రోత్సాహంతో తాము ఎంచుకున్న రంగంలో ఉన్నతికి కృషి చేస్తున్నామన్నారు.



ఉపాధ్యాయురాలు అర్చనతో కలిసి పురస్కారాలు పొందిన అక్కాచెల్లెళ్లు సంజన, సాన్విక

ప్రశ్న పత్రాల లీక్ ప్రభుత్వ వైఫల్యాలకు నిదర్శనం

కాంగ్రెస్ నేత మల్లు రవి

చంచల్‌గూడ: పదో తరగతి పరీక్ష పత్రాల లీక్ ఘటనలో ఎస్ఎస్‌సీ బోర్డు కార్యాలయం వద్ద నిరసన తెలిపిన ఎన్ఎస్‌యూఐ నాయకులను అరెస్టు చేసి చంచల్‌గూడ జైలుకు తరలించిన విషయం తెలిసిందే. జైల్లో ఉన్న యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు శివసేనా రెడ్డి, ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడు బల్మూర్ వెంకట్ తదితరులను మంగళవారం మాజీ ఎంపీ మల్లు రవి ప్రత్యేక ములాఖత్‌లో కలిసి పరామర్శించారు. అనంతరం ఆయన జైలు బయట మీడియాతో మాట్లాడుతూ, కాంగ్రెస్ నాయకులు నిరసన తెలిపితే నాన్‌బెయిల్‌బుల్ సెక్షన్ల కింద అరెస్టు చేసి జైళ్లకు పంపడం దారుణమన్నారు. నిన్న 10వ తరగతి ప్రశ్న పత్రాలు, మొన్న టీఎస్‌పీఎస్‌సీ ప్రశ్న పత్రాలు లీక్ కావడం ప్రభుత్వ వైఫల్యాలను సూచిస్తోందన్నారు. పేపర్లు లీక్ కాకుండా ప్రభుత్వ పటిష్టమైన చర్యలు తీసుకుని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు.



జైల్లో ఉన్న కాంగ్రెస్ నాయకులను కలిసి వస్తున్న మల్లు రవి తదితరులు

‘మత్తు’ డ్రైవింగ్ ప్రమాదాలకు హేతువు



మద్యం తాగి వాహనాలు నడిపిన వారికి కౌన్సెలింగ్ ఇస్తున్న ట్రాఫిక్ పోలీసులు

నాగోలు: మద్యం తాగి వాహనాలు నడపడం ప్రమాదకరమని రాచకొండ ట్రాఫిక్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ ఎస్‌పీఓలు అమరవర్ధన్‌రెడ్డి, అల్లూరయ్య హెచ్చరించారు. రాచకొండ కమిషనరేట్ పరిధిలో మద్యం తాగి వాహనాలు నడిపి తనిఖీలో పట్టుబడిన 150 మంది మందుబాబులకు వారి కుటుంబ సభ్యుల సమక్షంలో మంగళవారం ఎల్‌బీనగర్‌లోని ట్రాఫిక్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ (టీటీఐ)లో కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా మద్యం మత్తులో వాహనాలు నడిపితే జరిగే ప్రమాద దృశ్యాలను ప్రదర్శించారు. తాగి వాహనాలు నడిపే వారు ప్రమాదానికి గురైతే కుటుంబం రోడ్డు పాలవుతుందన్న విషయాన్ని గుర్తు పెట్టుకోవాలన్నారు. మద్యం తాగి వాహనాలు నడపకూడదని నిర్ణయించుకోవాలన్నారు. మద్యం తాగి వాహనాలు నడిపే వారు ప్రమాదాలకు కారణమై ఏ మాత్రం సంబంధం లేని వారి జీవితాల్లోనూ విషాదం నింపుతారన్నారు. మద్యం మత్తులో వాహనాలు నడపరాదని, సీటు బెల్ట్, హెల్మెట్ పెట్టుకోవడం తదితర నిబంధనలు పాటిస్తే ప్రమాదాలు నివారించవచ్చని వివరించారు. టీటీఐ సిబ్బంది రమేష్ తదితరులు పాల్గొన్నారు.